బెంగాలీల నాట్లు భేష్

- ముమ్మరంగా ఖరీఫ్ వరినాట్లు
- బెంగాలీ కూలీలతో వరినాట్లకు రైతుల ఆసక్తి
- సమయంతో పాటు కూలి తక్కువ అంటున్న అన్నదాతలు



అనిగండ్లపాడులో నాట్లు వేస్తున్న బెంగాల్ కూలీలు

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మునేరు ఆయకట్టున రైతులు ముమ్మరంగా ఖరీఫ్ వరినాట్లు ప్రారంభించారు. వరినాట్లు వేయటానికి పశ్చిమబెంగాల్ కూలీల వైపున మొగ్గు చూపిస్తున్నారు. సాధారణంగా మహిళా కూలీలు వరి నాట్లు వేస్తారు. అయితే గత ఏడాదితో పాటు ఈ ఏడాది రైతులు ఎక్కువగా బెంగాల్ నుంచి వచ్చిన మగ కూలీలు చాలా సులభంగా, వరుస ప్రకారంగా వేగంగా వరినాట్లు వేస్తున్నారని తెలియటంతో ఇప్పుడు రైతులు చూపు బెంగాలీ కూలీలపై పడింది. వేగంగా పని చేయటమే కాకుండా తక్కువ నారు ఉపయోగిస్తున్నారని రైతులు అంటున్నారు.

ఎకరానికి రూ.2 వేల వరకు ఆదా..

బెంగాలీ కూలీలు నారు తక్కువగా, మొక్కకు, మొక్కకు మధ్య నిర్దిష్ట ఎడం ఉండేలా క్రమ పద్ధతిలో నాటటం వల్ల వరి దుబ్బులు ఎక్కువ చేసి దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. తక్కువ సమయంలో వరినాట్లు పూర్తి చేయటం, కూలీ తక్కువ ఉండటం, దిగుబడి ఎక్కువగా ఉండటంతో రైతులు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించటానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఒక్క అనిగండ్లపాడు గ్రామంలోనే వారం రోజుల లోపే 50 ఎకరాల వరకు నాట్లు వేశారు. సాధారణంగా ఎకరం పొలంలో నాటు వేయాలంటే 10 మంది కూలీలతో పాటు నారు పీకేందుకు, కట్టలు కట్టి మోసేందుకు మరో ఐదుగురు కూలీలు కావాల్సి ఉంటుంది. దీనివల్ల ఎకరానికి రూ.6 వేలకు పైగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అయితే బెంగాల్ కూలీలను పెట్టుకుంటే ఎకరానికి రూ.4,500 మాత్రమే ఖర్చు అవుతోంది. రైతు దమ్ము చేసి పొలం అప్పగిస్తే మొత్తం నాట్లు కూలీలు పూర్తి చేస్తున్నారు. బెంగాల్ కూలీలు రోజుకు ఆరు ఎకరాల్లో నాట్లు వేస్తున్నారని రైతులు అంటున్నారు. వేధిస్తున్న కూలీల కొరతకు బెంగాల్ కూలీలు ప్రత్యామ్నాయంగా ఉన్నారని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో నియోజకవర్గంలో సుమారుగా 9 వేల హెక్టార్లలో వరిసాగు ఉంటుంది.

కూలీల కొరత తీరింది



బెంగాల్ నుంచి కూలీల రాకతో కూలీల కొరత తీరింది. సమయం ఆదా కావటంతో పాటు ఖర్చు కూడా తగ్గింది. కనీసం ఎకరానికి రూ.2 వేలు పెట్టుబడి తగ్గింది. పొలాన్ని సెల్‌ఫోన్‌లో చూసుకుని కూలీలు దమ్ము చేసి పొలం అప్పగిస్తే చాలు నాట్లు పూర్తి చేస్తారు.

–ఆకుల నరేంద్ర, రైతు, అనిగండ్లపాడు

ఖర్చు తగ్గింది



బెంగాల్ నుంచి వచ్చిన మగ కూలీలు వరినాట్లు సులభంగా, వరుస ప్రకారం వేగంగా వేస్తారు. నాటు వేసేటప్పుడే దారులు చేస్తున్నారు. దీని వల్ల వరి దుబ్బులు బాగా వచ్చి పంట బాగా పండి దిగుబడి పెరుగుతోంది. అలాగే కూలీ రేట్లు కూడా తక్కువగా ఉంటున్నాయి. ఎకరానికి రూ.4,500 నాట్లకు తీసుకుంటున్నారు.

–మురళి, రైతు, అనిగండ్లపాడు

క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ



ఇందుగపల్లి(వత్సవాయి): నాయిని వెంకటపతి జ్ఞాపకార్థం కుమారుడు నరసింహారావు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లను సోమవారం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సోదరుడు శ్రీరాం సాయి వీటిని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవాటు చేసుకోవాలన్నారు. అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ మేల కృష్ణారావు, ఎంపీటీసీ చావా నాగేశ్వరరావు, హెచ్ఎం బెల్లంకొండ పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

కొణకంచి, శనగపాడు(పెనుగంచిప్రోలు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) అధికారి మోహన్ సందీప్ అన్నారు. ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా సంపూర్ణ అభియాన్ కార్యక్రమం కింద సోమవారం గ్రామాల్లోని హెల్త్ సెంటర్లలో వైద్య సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి హెల్త్ సెంటర్‌లో గర్భిణులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, సుగర్, బీపీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ నాగభూషణం, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



కంచికచర్ల: తల్లిదండ్రులు తమ చిన్నారులను దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ఆటపాటలతో కూడిన విద్యను చిన్నారులకు నేర్పించాలని అన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి పుట్టినరోజు వేడుక



నందిగామ టౌన్: మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఐతవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో కుమారుడు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు నాగేశ్వరరావుతో జన్మదిన కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రి ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రిగా, ఆప్కాబ్ చైర్మన్‌గా ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్డులో ఇబ్బందులను తొలగిస్తాం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో 22వ వార్డులో సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. మిట్టగూడెం పరిసర ప్రాంతాలలో కొన్ని చోట్ల వర్షం ప్రభావంతో బురద పేరుకుపోయి డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర స్థానిక 22వ వార్డులో పర్యటించారు. కార్మికుల సహాయంతో రోడ్లపై బురదను శుభ్రం చేయించారు. చైర్మన్ మాట్లాడుతూ 22వ వార్డులో మట్టి రోడ్డు ఉండటం వలన బురదమయం కావడమే కాకుండా కాలువలు మట్టితో నిండిపోయి ఉన్నాయని, వర్షాలు ఎక్కువగా రావడం వలనే ఈ విధంగా జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే తాతయ్య దృష్టికి తీసుకువెళ్లి సీసీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, కౌన్సిలర్ గొట్టె నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

రెండో రైతు బజారు పునః ప్రారంభం



రెండో రైతుబజారును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చిత్రంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మినీ బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన రెండో రైతు బజారును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోమవారం పునః ప్రారంభించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సెంటర్‌లో ఉన్న పాత రైతు బజారు ఇరుకుగా ఉండటంతో పాటు వినియోగదారుల రద్దీ పెరిగిపోవడంతో పాటు రైతుల డిమాండ్ మేరకు మరికొంత మంది రైతులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో 2022లో కరోనా సమయంలో ప్రస్తుతం ఉన్న రైతు బజారుకు సమీపంలోనే చెరువు ఒడ్డున రెండో రైతు బజారును ఏర్పాటు చేశారు. అప్పటి ప్రభుత్వ విప్‌గా ఉన్న సామినేని ఉదయభాను దీనిని ఏర్పాటు చేసి మంత్రితో ప్రారంభించారు. కాగా వ్యాపారం పాత రైతు బజారులోనే బాగా సాగుతుందని బావించిన రైతులు కొత్త రైతు బజారును వదిలి పాత రైతుబజారులో కౌంటర్లను ఏర్పాటు చేసుకోవడానికి ఇష్ట పడుతూ ఒక్కొక్కరుగా దీనిని వదిలివెళ్లారు. దీంతో అనతికాలంలోనే అది మూతపడింది. మరలా 64 కౌంటర్లతో ఏర్పాటుచేసిన కొత్త రైతుబజారును మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావుతో కలిసి ఎమ్మెల్యే పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పాత రైతుబజారులో కౌంటర్లు సరిపోకపోవడంతో రైతుల కోరిక మేరకు అదనంగా రెండో రైతుబజారును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ యలమంచిలి రాఘవ, మున్సిపల్ కౌన్సిలర్లు కె.రామలక్ష్మి, కె.గీతారాణి, ఎస్.బుజ్జిబాబు, పేరం సైదేశ్వరరావు, ఇర్రి నరసింహారావు, ఎస్.వెంకట్, ఎస్.మనోహర్, కర్ల జోజి, వేదులాపురి సైదా, రైతుబజారు ఈవో కెవీ.రమణ, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

టోల్‌వేస్ యాజమాన్యాలపై చర్యలకు వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నందిగామ టౌన్ : అక్రమంగా టోల్ చార్జీలు వసూలు చేస్తున్న టోల్‌వేస్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నియోజకవర్గ నాయకుడు మన్నే హనుమంతరావు పేర్కొన్నారు. టోల్‌వేస్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవో రవీంద్రరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 కి.మీల వ్యవధిలో నివాసముండే వాహనదారుల నుంచి టోల్‌చార్జీలు వసూలు చేయకూడదని కేంద్ర ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నా యన్నారు. అయినప్పటికీ కీసర, చిల్లకల్లు టోల్‌ప్లాజా యజమానులు అక్రమంగా టోల్ చార్జీలను వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి టోల్ చార్జీలు వసూలు చేయకుండా టోల్‌ప్లాజా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, రామ్‌లాల్, బుజ్జి, అమర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

నందిగామ టౌన్: రాజకీయ కారణాలతో విధుల నుంచి తొలగించిన వెలుగు మిత్రలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ కోరారు. తొలగించిన వెలుగు మిత్రలను తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేసి ఆర్డీవో రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో వంద మందికి పైగా వెలుగు మిత్రలు పని చేస్తున్నారని తెలిపారు. వీరిని అధికార పార్టీ నాయకులు వేధింపులకు గురి చేస్తూ రాజకీయ కక్షతో అకారణంగా విధుల నుంచి తొలగించారని మండిపడ్డారు. తొలగించిన వీవోఏలను తీసుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు మిత్రలు శ్రీలక్ష్మి, చంద్రకళ, షేక్ దిల్‌షా, కుమారి, లక్ష్మి, మల్లీశ్వరి, సుమలత, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

జగ్గయ్యపేట: మండలంలోని అల్ట్రాటెక్, రామ్‌కో సిమెంట్ కర్మాగారాలలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ట్రాటెక్‌లో ప్రమాదంలో మృతులకు కలెక్టర్ చొరవతో యాజమాన్యం రూ.50 లక్షలు అందించగా ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదన్నారు. రామ్‌కో కర్మాగారంలో వ్యక్తి మృతి చెందాడని యాజమాన్యం నష్టపరిహారం అందించగా ప్రభుత్వం అందించలేదన్నారు. ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని కోరారు. నాయకులు రాజేంద్రబాబు, గోవిందరాజులు, మధు, రాయప్ప, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి

కంచికచర్ల: తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన వృద్ధుడిని రివర్స్‌లో వస్తున్న లారీ ఢీకొనగా మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు షేక్ షాబుద్దీన్(85) తన కుమారుడి చికెన్ దుకాణంలో పనిచేస్తుంటాడు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లాడు. అదే సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో లారీ రివర్స్ చేస్తుండగా వృద్ధుడిని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి ఐదుగురు సంతానం ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కాకరవాయి (వత్సవాయి): పిన్నమనేని సిద్ధార్థ, కొమరగిరి ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఆపరేషన్లకు అవసరమైన వారిని గుర్తించి అదే రోజు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. పరీక్షలకు హాజరయ్యే వారు తప్పకుండా వారి ఆధార్ కార్డును వెంట తీసుకొని రావాలని సూచించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 35 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. గౌరవ కౌన్సిల్ సభ్యులు, గౌరవ ఎక్స్ అఫీషియో మెంబర్లు హాజరు కావాలని కోరారు.

బతుకు భారమై.. ప్రొక్లయిన్‌కు ఉరేసుకుని..

కంచికచర్ల: అక్క చెల్లెళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీర్చమని తండ్రి ఫోన్ చేసి కొడుక్కి చెప్పటంతో అప్పులు తీర్చలేమోనని ఆవేదనతో ప్రొక్లయిన్‌కు వైర్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పరిటాల శివారు దొనబండలో సోమవారం జరిగింది. ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ధి జిల్లా గాంధీగ్రాంకు చెందిన దేవరాజ్ రావత్ (24) తన అక్కాబావలతో కలసి నాలుగేళ్ల క్రితం దొనబండ గ్రామానికి వచ్చారు. దొనబండ గ్రామానికి చెందిన ఎర్రబోయిన జైరామ్‌కు చెందిన ప్రొక్లయిన్‌కు దేవరాజ్ రావత్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. దేవరాజ్ అక్క చెల్లెళ్ల పెళ్లిళ్లకు అప్పులు అయ్యాయి. ఆ అప్పులు తీర్చాలని దేవరాజ్‌కు తండ్రి ఫోన్ చేసి చెప్పాడు. పొలం అమ్మి అప్పు తీర్చాలని దేవరాజ్ తన తండ్రితో చెప్పాడు. పొలం అమ్మను అప్పులు నీవే తీర్చాలని తండ్రి అనటంతో మనస్తాపం చెంది తను హెల్పర్‌గా పనిచేసే ప్రొక్లయిన్‌కు వైరుతో ఉరేసుకున్నాడు. స్థానికులు వచ్చి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అక్క వేణు రావత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యతో గొడవల కారణంగా మనస్తాపం చెంది..



ఉద్దండు సైదా మృతదేహం

కంచికచర్ల: భార్యభర్తల మధ్య తరచూ గొడవలతో మనస్తాపం చెందిన భర్త ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ పెంకె వెంకటసత్య సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన షేక్ ఉద్దండు సైదా (29) అదే గ్రామానికి చెందిన జానీబీతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. గత వారం రోజుల నుంచి భార్యభర్తల మధ్య ఇంట్లో విషయాలపై గొడవలు జరుగుతున్నాయి. అయితే జానీబీ తన చెల్లి గర్భవతి అయితే ఆమెకు సేవలు చేసేందుకు పుట్టింటికి వెళ్లింది. తనను పట్టించుకోకుండా తన కుటుంబ సభ్యులకు సేవలు చేస్తుందని మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారు వచ్చి చూసి ఫ్యానుకు వేలాడుతున్న సైదాను కిందకు దించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సైదాను అతని భార్య హత్య చేసి ఉంటుందని మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటి ముందు రోడ్డుపై ఉంచి కొంతసేపు ఆందోళన చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

న్యాయమూర్తులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రావణి, వేదికపై న్యాయమూర్తి శోభారాణి, కళాశాల ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని న్యాయమూర్తులు తెలిపారు. సోమవారం స్థానిక వాగ్దేవి మహిళా కళాశాలలో జరిగిన ర్యాగింగ్ నివారణ అవగాహన సదస్సులో స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి మాట్లాడారు. కళాశాలలో జూనియర్ విద్యార్థుల పట్ల సీనియర్ విద్యార్థులు చేసే వికృత చేష్టలనే ర్యాగింగ్ అంటారన్నారు. ర్యాగింగ్‌కు విలువైన జీవితాలు బలికాకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని న్యాయమూర్తులు సూచనలు చేశారు. జూనియర్ విద్యార్థుల పట్ల సీనియర్ విద్యార్థులు సోదరభావంతో ఉంటూ విద్యను అభ్యసించడం ద్వారా పలువురికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ర్యాగింగ్‌పై చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక సుందరరావు, కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్, కరస్పాండెంట్ సరిత, బీఎస్సీ నర్సింగ్, ఫుడ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, కంప్యూటర్స్ బీకాం విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ



పేటలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడ న్యాయవాదిపై మంగళగిరి పోలీసులు అక్రమ కేసు బనాయించడాన్ని నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు మాట్లాడుతూ విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు ఒగ్గు గవాస్కర్ ఈనెల 26వ తేదీన నిందితుల తరపున మాట్లాడటానికి మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడన్నారు. మంగళగిరి పోలీసులు 2021లో జరిగిన సంఘటనలో ఒగ్గు గవాస్కర్ పేరును అక్రమంగా ఇంప్లీడ్ చేసి కోర్టులో మెమో దాఖలు చేశారు. కాగా దీనిని నిరసిస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు దామాల సంతోష్, మెట్టెల ఆంజనేయులు, బాణావత్ గాంధీ, జగ్జీవన్‌రామ్, పి.సత్యశ్రీనివాసరావు, బి.వెంకట్రామయ్య, ఎ.కాంతారావు, కె.నరసింహారావు, జి.లక్ష్మీనారాయణ, జె.శ్రీనివాసరావు, బసవరాజు, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, గోపీనాథ్, నరసింహారెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణ, బిక్షమయ్య, జోగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శుభదిన్ కార్యక్రమం ప్రారంభం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తదితరులు

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుభదిన్ కార్యక్రమాన్ని సర్పంచి బొక్కా రవికుమార్ సోమవారం ప్రారంభించారు. సర్పంచి మాట్లాడుతూ తిథి భోజనం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఎవరైనా పుట్టిన రోజు వేడుకలు, ప్రమోషన్ సాధించిన రోజు అదనంగా ఆహారాన్ని అందించే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇతరులెవరైనా వారి సంతోషాన్ని విద్యార్థులతో పంచుకోవాలని, వారికి ఏదో విధంగా అదనపు అల్పాహారాన్ని అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టటం జరుగుతోందన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు తిథి భోజనాన్ని అందజేశారు. నాయకులు కే రంగారావు, హెచ్ఎం రామకృష్ణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): జాతీయ విద్య కార్యక్రమం (ఎన్ఈపీ)లో భాగంగా సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చివరి రోజు (పీఎం పోషణ)కింద తిథి భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు అరటి పండ్లు, గ్రామ పెద్దలు చంద్రుపట్ల లక్ష్మీనారాయణ 10 కిలోల పెరుగు బకెట్, కూచి మోహనరావు 10 కిలోల బియ్యం అందజేసినట్లు హెచ్ఎం సీహెచ్ రామారావు తెలిపారు. విద్యార్థులతో పాటు ఎంఈఓ డి.రవీంద్ర, నేతలు, ఉపాధ్యాయులు భోజం చేశారు.

వత్సవాయి: స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం తిథి భోజనాలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పెద్ది రామారావు వితరణతో పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు పౌష్టికాహారం, పండ్లను అందజేశారు. హెచ్ఎం ఆర్.అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు కాకాని శ్రీనివాసరావు, పీడీ మార్కపూడి బాబూరావు, సీఆర్పీ వై.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: మండలంలోని బలుసుపాడు, గండ్రాయి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ మధ్యాహ్న భోజనం 'శుభదిన్ భోజనం' పేరుతో విద్యార్థులకు భోజనంతో పాటు దాతలు అందించిన పండ్లు, స్వీట్లను ఉపాధ్యాయులు అందించారు. బలుసుపాడులో వెలమాటి చంద్రమౌళి విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, రమేష్, సుబ్బారావు, దుర్గాప్రసాద్, నరసింహారావు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: శిక్ష సప్తాహ కార్యక్రమంలో సోమవారం సామాజిక భాగస్వామ్య దినోత్సవంలో భాగంగా స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావుతో కలిసి విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. అనంతరం వారితో కలసి భోజనం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెపటైటిస్‌పై అవగాహన



కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో వైద్యురాలిని సత్కరించిన డీన్ ప్రకాష్, ఆంథోని తదితరులు

కీసర(కంచికచర్ల): వైరల్ హెపటైటీస్ అనేది కాలేయాన్ని ప్రభావితం చేసి అంటు వ్యాధుల సమూహాన్ని సూచిస్తుందని పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు జెస్సీలివింగ్ ఫెయిత్ పేర్కొన్నారు. మండలంలోని కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో వైరల్ హెపటైటిస్ గురించి సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్యులు మాట్లాడుతూ హెపటైటిస్‌కు చికిత్స చేయకుండా వదిలేస్తే దీర్ఘకాలిక కాలేయ వ్యాధి, సిర్రోసిస్, కాలేయ క్యాన్సర్ కూడా వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో హెపటైటిస్ లక్షణాలను గుర్తించి అవసరమైన మందులు ఉచితంగా ఇవ్వటం జరుగుతుందని వైద్యులు తెలిపారు. అనంతరం ఆమెను కళాశాల ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ దుగ్గిరాల ప్రకాష్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బ్రదర్ ఆంథోని విద్యార్థులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

వత్సవాయి: అర్హత కలిగిన డప్పు కళాకారులకు వయస్సుతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులను అందించాలని డప్పు కళాకారుల సంఘ జిల్లా కార్యదర్శి ఎం.కుటుంబరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పలుచోట్ల రాజకీయ కారణాలతో కొన్నిచోట్ల పింఛన్లను నిలిపివేశారన్నారు. అటువంటి సమస్యలను వెంటనే పరిష్కరించి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. డప్పు కళాకారుల పింఛన్‌ను కూడా రూ.6 వేలకు పెంచాలన్నారు. 40 ఏళ్ల వయస్సు ప్రాతిపదికగా తీసుకుని పింఛన్ ఇవ్వాలన్నారు. మండలంలో డప్పు కళాకారుల శిక్షణాకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ డీటీ రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు జి.ఆదాం, బాబు, ప్రభాకర్, దాసు, దానియేలు, వెంకటరత్నం, బెంజిమెన్, సులేమాన్, సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి కుటుంబానికి పరామర్శ



వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉదయభాను

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామ మాజీ సర్పంచి పరిటాల వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను సోమవారం పరామర్శించారు. ఇటీవల సర్పంచి కుమారుడు అర్జున్ అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఎస్సీ సెల్ నాయకుడు బూదిద నరసింహారావు తల్లి ఇటీవల మృతి చెందగా ఆమె చిత్ర పటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు తుమ్మల ప్రభాకర్, బాణావత్ బాల్య, గడ్డం శ్రీను, శేషం ప్రసాద్ పాల్గొన్నారు.

చివరి భూములకూ సాగునీరు అందిస్తాం

కంచికచర్ల: ఆయకట్టులో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. వేములపల్లి, చెవిటికల్లు, గనిఆత్కూరుల్లోని పంపింగ్ స్కీములను సోమవారం ప్రారంభించారు. సీఎం చంద్రబాబు రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.